క్లుప్తంగా

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్ల పాడు గ్రామంలోని సబ్ సెంటర్లో బుధవారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ మాట్లాడుతూ బోరు నీటి వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. జంక్‌ఫుడ్‌లు తినకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. దీని ద్వారా ఫ్లోరోసిస్‌ను నియంత్రించవచ్చని చెప్పారు. హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, సీహెచ్ఓ బాలకీర్తి, ఏఎన్ఎం మాధురి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలి

తాడేపల్లిరూరల్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆప్కాస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని మున్సిపల్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో గ్రూపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో పోలీసులు ప్రవర్తించిన తీరు అమానుషమని వ్యాఖ్యానించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు మేరి, శ్రీను, కామాక్షి, సుబ్బులు, నాని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్వరం గృహ నిర్మాణాలు చేపట్టాలి




ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ సచివాలయం పరిధిలోని 1,2 లేఅవుట్ల పరిధిలోని గృహ నిర్మాణాలను బుధవారం ఎంపీడీఓ శివ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేయని వారు ఇప్పటికైనా పూర్తి చేసేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు వీలుగా ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు ఇస్తున్నారని వీటితో లబ్ధిదారులు ఇంటినిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. గృహ నిర్మాణాల వద్ద ఉన్న పిచ్చికంపను తొలగించాలని సిబ్బందికి సూచించారు. మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

వేణుగోపాలరావుకు ఘనసన్మానం

దుగ్గిరాల: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని దుగ్గిరాల ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన దుగ్గిరాల పెదపాలెం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు జి.వేణుగోపాలరావును బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, బి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలి



తెనాలి అర్బన్: పండ్ల మార్కెట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఆదేశించారు. బుధవారం మార్కెట్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను దగ్గరుండి పరిశీలించారు. ప్రతిరోజు కాలువలను బాగు చేయాలని.. వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

చంద్రబాబు మోసాలు బట్టబయలు

- ఏడాదిలోనే ఆయన నిజస్వరూపం ప్రజలకు తెలిసింది
- ప్రజలు ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారు
- ఇచ్చిన బాండ్లపై ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రజలకు అవగాహన కల్పించాలి
- ప్రభుత్వ అరాచకాలను నిలదీద్దాం
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సభలో వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



ఉండవల్లి సభలో క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తి అయ్యేటప్పటికి కూటమి ప్రభుత్వం నిజస్వరూపం బట్టబయలు అయ్యిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలను మోసగించారని రుజువయ్యిందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని పోలకంపాడు, సంజీవయ్య నగర్ 18వ వార్డులో, ఉండవల్లి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఉండవల్లిలో తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్న దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంవత్సరం గడవకముందే ఇచ్చిన హామీలతో పాటు అప్పటి పరిస్థితులను బట్టి కొత్తగా కొన్ని హామీలను ఇచ్చి నెరవేర్చాని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా నామమాత్రంగా ఒకటి రెండు సంక్షేమ పథకాలను తూతూ మంత్రంగా నిర్వహించి గొప్పలు చెబుతున్నారని ఆయన అన్నారు.

ఇప్పటికే జనం నిలదీస్తున్నారు..

ఇప్పటికే పలువురు మంత్రులు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అంటూ బాండ్లు పంచినప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాబోయే కాలంలో ప్రజలే స్థానిక నాయకులను, కూటమి ప్రజాప్రతినిధులను నిలదీస్తారని, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కూటమి నేతలను మహిళలు నిలదీస్తున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్సరాలకు పెన్షన్లు ఇస్తామని చెప్పి ఏడాది దాటుతున్నా నేటికీ ఆ హామీపై ఒక్క మాట మాట్లాడడం లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు వ్యంగంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. సంజీవయ్య నగర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గోరేబాబు, సీనియర్ మహిళా నాయకురాలు కొండా విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు జీలగ గాలయ్య, ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహసంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ఉండవల్లిలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు సంకురు మరియబాబు, బాణావత్ వెంకటేశ్వరరావు ప్రముఖ న్యాయవాది బాజీ గంగాధర్, రూరల్ మహిళా అధ్యక్షురాలు నాగ స్రవంతి, మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి (పిచ్చిరెడ్డి), విభజన విభాగ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, మండల కార్యదర్శి దామేశ్వరరెడ్డి, ఉండవల్లి పార్టీ అధ్యక్షులు మున్నంగి వీర శ్రీధర్ రెడ్డి, అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పచ్చల విజయకుమార్, కూరపాటి బుల్లిబాబు, మన్నెం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరం ప్రజలు అప్రమత్తంగా ఉండండి



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద నీరు వచ్చి చేరడంతో దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేశారని, కృష్ణానది పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు.. ప్రకాశం బ్యారేజ్ వద్ద వచ్చిన వరద నీటిలో 65 వేల క్యూసెక్కులను కిందకు వదిలారన్నారు. మహానాడు, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను ఎవరూ కృష్ణానదిలోకి తోలుకు వెళ్లవద్దని, కృష్ణానది నీటిలో దిగడానికి వీలులేదని, కృష్ణానదికి వరద నీరు 3 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చే అవకాశం ఉందని, ఆయా గ్రామాలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు అప్రమత్తంగా ఉండి ఎవరూ కృష్ణానదిలోకి దిగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

కేఎల్‌యూలో అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయవాది లాస్యప్రియ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, కేఎల్ న్యాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహిళలు న్యాయ సహాయం పొందే హక్కుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది కోనేరు లాస్యప్రియ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో మహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించే క్రమంలో న్యాయ సహాయం పొందే హక్కు ఉందన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు గృహహింస నుంచి పని ప్రదేశాలలో వివక్ష, చట్టపరమైన, సామాజిక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఉచిత న్యాయ సహాయం అనే హామీ శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ఎ కింద గుర్తించబడిన ఉచిత న్యాయ సహాయం హక్కు ప్రతి పౌరుడు, వారి సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా న్యాయం పొందగలిగేలా రూపొందించబడిందని అన్నారు. వర్సిటీ ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఫ్యాకల్టీ కన్వీనర్ మెగా ఊజా తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికులపై లాఠీచార్జి దారుణం

ఉండవల్లి, పెనుమాకల్లో నిరసన తెలిపిన పారిశుద్ధ్య కార్మికులు



పెనుమాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్: నెల్లూరులో మహిళా పారిశుద్ధ్య కార్మికులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాకల్లో బుధవారం ఖాళీ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎంటీఎంసీ రాజధాని ప్రాంత గౌరవ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ నెల్లూరులో మున్సిపల్ మహిళా కార్మికులపై లాఠీచార్జి చేసి బూటు కాళ్లతో తన్నిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా మార్చే వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత 15 రోజుల నుంచి నెల్లూరు పట్టణంలో వర్క్ అవుట్ సోర్సింగ్ విధానానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టి విజయం సాధించిన మున్సిపల్ కార్మికులకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. నెల్లూరులో పోరాట ఫలితంగా మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగిస్తామని, సమ్మె కాలపు వేతనం చెల్లిస్తామని, పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఐటీయూ నాయకులు వేణు, గురవయ్య, వల్లభాపురం వెంకటేశ్వరరావు, కుశలరావు, కార్మికులు మేరి, సుబ్బులు, స్వర్ణకుమారి, స్వరూప నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారంపై ప్రజాసంఘాల నాయకులు ప్రజల్లో అవగాహన పెంచుతూ బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు మాట్లాడుతూ ప్రజలు అధికంగా వస్తున్న విద్యుత్ బిల్లులతో ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. దీనికితోడు కొత్తగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటం ప్రజలకు మరింత భారంగా తయారవుతుందని తెలిపారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న నేటిపాలకులు అప్పుడు వ్యతిరేకించి ఇప్పుడు వాటిని బిగించేందుకు సన్నద్ధం కావడాన్ని వ్యతిరేకించాలన్నారు. అనంతరం కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, రైతుసంఘం నాయకులు కె.శ్రీనివాస్, జి. వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

'మార్పుల' కుటుంబ సభ్యులకు పరామర్శ



రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మోదుగుల, డైమండ్ బాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి తండ్రి మార్పుల రామచంద్రారెడ్డి ఇటీవల మృతి చెందగా, బుధవారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలోని శివరామిరెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్‌బాబు)లు పరామర్శించారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారి వెంట చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదులు, టి.వెంకటరెడ్డి, డి.వినోద్, కె.బ్రహ్మారెడ్డి, పోలారెడ్డి ఉన్నారు.

ఈకేవైసీ నమోదు చేయించుకోండి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



కంఠంరాజుకొండూరు గ్రామంలో పీ 4 సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలో ఈకేవైసీ పెండింగ్ అని వచ్చిన రైతులు వెంటనే సమీపంలోని రైతు సేవాకేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి సూచించారు. బుధవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని, కంఠంరాజుకొండూరు గ్రామంలో పీ4 సర్వే నీడ్ అసెస్మెంట్ సర్వేను జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి నేటితో ఈకేవైసీ ముగుస్తున్నందున పెండింగ్‌లో ఉన్న రైతులు త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. అనంతరం మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ను కలెక్టరు రైతు గ్రూప్ సభ్యులకు అందించారు. కంఠంరాజుకొండూరు గ్రామంలోని పీ-4 నీడ్ అసెస్మెంట్ సర్వే కింద బంగారు కుటుంబాల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వారికి అవసరమైన విద్య, ఉపాధి, పక్కా గృహాలు, మౌలిక సదుపాయాల అవసరం తెలుసుకొని అధికారులను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వర రావు రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, సీపీఓ శేషశ్రీ, జిల్లా హౌసింగ్ అధికారి ప్రసాదు, దుగ్గిరాల తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీఓ శ్రీనివాస రావు, మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు, చిలువూరు గ్రామ సర్పంచ్ మాణిక్యం, ఎంపీపీ షేక్ జబీన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాడం ఆడవద్దని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు యాజమాన్యాన్ని కోరారు. బుధవారం నాటికి తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 239వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ కార్యదర్శి స్టీవెన్, కమిటీ సభ్యులు ఆదినారాయణతో కలసి వేముల దుర్గారావు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా ఫ్యాక్టరీ భూముల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగనివ్వబోమని హెచ్చరించారు. పేద కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్య వైఖరి దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు హగ్గయ్య, పిచ్చయ్య, నాగమల్లేశ్వరి, వేముల లక్ష్మి, రమాదేవి, శికుమారి, దుర్గాభవాని, అంకయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లకు దారి వదలండి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ గ్రామ పరిధిలోని వసంత లక్ష్మి నగర్‌లో వెంచర్‌లో కాలువ నిర్మాణంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ సర్వే నెం. 55/1లో ఏర్పాటైన ఈ కాలనీలో సుమారు 200 ప్లాట్లు అమ్మకం జరిగాయని, 76 ప్లాట్లు సీఆర్‌డీఏ లేఅవుట్ రెగ్యులర్ స్కీమ్ కింద మంజూరయ్యాయని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసినపుడు డాక్యుమెంట్లలో 33 అడుగుల రహదారి ఉన్నప్పటికీ, ఇటీవల ఓ రైతు అదే రోడ్డు మార్గంలో కాలువ తవ్వకాలు చేపట్టారని పేర్కొన్నారు. ఆరు అడుగుల విస్తీర్ణంలో కాలువ తవ్వుకోవాలని తహసీల్దార్ తెలియజేశారని, కానీ సదరు రైతు మాత్రం 20 అడుగుల మేర తవ్వడంతో ప్లాట్లకు రహదారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వ్యవసాయానికి, రైతులకు వ్యతిరేకం కాదని, ప్లాట్లకు దారి ఉండేలా వదిలి కాలువ నిర్మించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రాజధాని గ్రామాల్లో జోరుగా జూదం



నీరుకొండ వద్ద యథేచ్ఛగా కొనసాగుతున్న కోడి పందేలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పందెం కోడి తొడకొడుతోంది. అధికారులు, పోలీసులు నిఘా విభాగం నిద్రపోతుండటంతో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట నిర్వహణ జోరుగా కొనసాగుతోంది. అధికార పార్టీకి చెందిన వ్యక్తులతోపాటు, గుంటూరు, మంగళగిరి, విజయవాడ, అమరావతి, సత్తెనపల్లి, తెనాలి ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పందెంలో, పేకాటలో పాల్గొంటూ రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు.

పందెం రాయుళ్ల క్యూ..

29 గ్రామాల పరిధిలోని తుళ్లూరు మండలం నెక్కల్లు, వడ్డమాను, పెదపరిమి, శాఖమూరు, తుళ్లూరు, వెంకటాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, లంక, మంగళగిరి రూరల్ మండలం నీరుకొండ, తాడికొండ మండలం మోతడక, కంతేరు, నిడుముక్కల, పాములపాడు, బండారుపల్లి, పలు గ్రామాల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. దీనిపై ఆయా విభాగాలకు చెందిన పెద్దలకు భారీగా ముడుపులు ముట్టజెబుతున్నామని, నిర్వాహకులు అభయం ఇస్తుండటంతో విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు క్యూ కడుతున్నారు. రోజూ యథేచ్ఛగా ఈ తంతు కొనసాగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువత లక్ష్యంగా కోడిపందేలు భారీగా కొనసాగుతున్నాయి. కోతముక్క ఆడేందుకు క్యూ కడుతున్నారు. ఇందుకు గాను రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. కాగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న మాల్యాద్రి

తాడేపల్లిరూరల్: ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఉద్యమం నిర్వహిస్తామని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ ఆగస్టు 6వ తేదీ అన్ని మండల కార్యాలయాల వద్ద స్మార్ట్ మీటర్లు వద్దని ఆందోళన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించవద్దని పేర్కొన్నారు. విజయవాడలోని గుణదల ఎలక్ట్రికల్ ఏఈ ఈ విషయంలో అత్యుత్సాహం చూపుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలకొట్టండని పిలుపునిచ్చారని, నేడు ఆయన మాట తప్పి ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు 10వ తేదీ మంగళగిరిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, వై.బర్నబాస్, ఎస్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఉద్యమంలో భాగస్వాములు కావాలి...

తాడేపల్లిరూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు, ఇంధన చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలకు అదనంగా ప్రజలపై భారాలు మోపిందని అన్నారు. స్మార్ట్ మీటర్ల వలన ముందస్తు చార్జీలు చెల్లించే విధానం ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని వివరించారు. ఆగస్టు 5వ తేదీన గ్రామగ్రామాన స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, కొండలరావు, బొడ్డు వెంకటేష్, శేషంశెట్టి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి



తెనాలి రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు డీలర్లు, వ్యాపారులను కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం స్టేషన్ పరిధిలోని పురుగు మందులు, ఎరువులు, విత్తనాల డీలర్లు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించే రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. వ్యాపారమే పరమావధిగా కాకుండా రైతు శ్రేయస్సు కూడా దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కోరారు. రైతులను మోసగించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.ప్రకాశరావు, మండల వ్యవసాయ అధికారి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

తెనాలి అర్బన్: దంతాలను ప్రతి రోజు శుభ్రం చేసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ కడియాల పల్లవి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పేర్ల వసంతలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆమె దంత పరీక్షలు చేసి బ్రష్, పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు లయన్ నేరెళ్ల వెంకట కృష్ణ మోహనరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీకుమార్, కొణిజేటి రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.